క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో నాగ దేవతలకు పూజలు



పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : నాగ దేవతలకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. వీధుల్లో పుట్టల వద్ద మాత్రమేగాక ఆలయ ప్రాంగణాల వద్ద ఉదయం 5 గంటల నుంచి తరలివచ్చిన భక్తులు నాగదేవతలకు పాలు పోసి పూజలు చేశారు. తమ కుటుంబాలను కాపాడాలని వేడుకున్నారు.

చిన్నారులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఉదయభాస్కర్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని మా అమ్మ ఒడి అనాథ బాలల ఆనంద నిలయంలో చిన్నారులకు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ముంబయిలోని డాక్టర్ ముక్కు కిరణ్మయి సహకారంతో విద్యార్థులకు టీ షర్టులు, నైట్ ప్యాంట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఉదయభాస్కర్ మాట్లాడుతూ చిన్నారులకు తమ వంతు తోడ్పాటు అందించడం సంతోష దాయకంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఈ సేవా కార్యక్రమాల నిర్వహణకు తోడ్పాటు అందిస్తామని తెలిపారు.

కడప ఏడీఏగా శంకర్‌నాయక్



కడప అగ్రికల్చర్ : కడప డివిజన్ వ్యవసాయశాఖ ఏడీఏగా వై.శంకర్‌నాయక్ నియమితులయ్యారు. గతంలో కడప ఏడీఏగా పనిచేస్తున్న సుబ్బారావు పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ఏవోగా పనిచేస్తున్న సురేష్‌కుమార్‌రెడ్డి ఏడీఏగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎన్‌టీఆర్‌జిల్లా కొండపల్లి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న శంకర్ నాయక్‌ను రెగ్యులర్ ఏడీఏగా నియమించారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి



మాట్లాడుతున్న రీసోర్స్ పర్సన్ ఉదయ్‌కుమార్‌రెడ్డి

కడప స్పోర్ట్స్ : యువత సన్మార్గంలో నడుస్తూ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జైళ్ల శాఖ రిసోర్స్ పర్సన్ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. కడప నగరంలోని పి.రామిరెడ్డి ఫార్మసీ కళాశాలలో యువజన సర్వీసుల శాఖ (స్టెప్) ఆధ్వర్యంలో 'వ్యక్తిత్వ వికాసం-కెరీర్ కౌన్సిలింగ్'పై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రీసోర్స్ పర్సన్‌గా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ యువత చెడుస్నేహాలు, ర్యాష్‌డ్రైవింగ్, ఆన్‌లైన్ గేమింగ్, సోషల్ మీడియా, లవ్ తదితర అంశాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.నెల్సన్, అధ్యాపకులు నరసింహకుమార్, టి.నాగయ్య, వివి.సుబ్బారాయుడు, వివి.నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కడప ఎడ్యుకేషన్ : ప్రతి ఒక్కరికీ ట్రాఫిక్ విధి విధానాలపై ఖచ్చితమైన అవగాహన ఉండాలని శ్రీచైతన్య ఏజీఎం రమణయ్య పేర్కొన్నారు. బుగ్గవంక ప్రాజెక్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాల బ్రాంచ్‌లో మంగళవారం సేవ్ ఇండియా- స్మార్ట్ లివింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ట్రాఫిక్ విధి విధానాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. భాస్కర్‌రావు, బీఆర్.కళ్యాణ చక్రవర్తి, హరిక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో అన్నదానం

కడప అర్బన్: ప్రముఖ పారిశ్రామిక వేత్త, దివంగత నాయకుడు కందుల శివానందరెడ్డి జ్ఞాపకార్థం మంగళవారం కందుల గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్స్ చైర్మన్ కేసీ ఓబుళరెడ్డి (కందుల నాని) ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఇక నుంచి కడప రిమ్స్ ఆవరణంలో ప్రతి మంగళ, శుక్రవారాలలో అన్నప్రసాదాలను వితరణ చేస్తామని తెలియజేశారు. డాక్టర్స్ నారాయణ రెడ్డి, కమలాకర్, క్రిష్ణారెడ్డి, భాస్కర్, రోహిత్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న అన్నమయ్య సర్కిల్

కడప అర్బన్: కడప నుంచి రాజంపేటకు వెళుతున్న ఆర్టీసీ అద్దె బస్సు కడప అన్నమయ్య సర్కిల్‌ను వేగంగా ఢీకొంది. చుట్టూ అమర్చిన గ్రిల్ నిర్మాణం దెబ్బతింది. ఎవరికీ ప్రమాదం జరగలేదు. బస్సు వేగంగా వచ్చి సర్కిల్‌ను ఢీకొందని స్థానికులు భావిస్తున్నారు.

పార్కింగ్ కాదు.. పోస్టల్ కార్యాలయం



పోస్టల్ ప్రధాన కార్యాలయంలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయం వాహనాల పార్కింగ్‌ను తలపిస్తోంది. అక్కడికి వచ్చే వాహనాలను ప్రధాన ద్వారం వద్ద జనం పార్కింగ్ చేయడంతో కార్యాలయంలోకి వెళ్ళేందుకు దారిలేక ప్రజలు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. పోస్టల్ కార్యాలయంలో గేట్ ఎదుట వాచ్‌మెన్ కనిపించక పోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా పార్కింగ్‌కు స్థలం ఏర్పాటు చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

– కడప వైఎస్ఆర్ సర్కిల్

రహదారి.. గోతులమయం

నగర శివారులోని అలంఖాన్‌పల్లె సర్కిల్ నుంచి జెఎంజె వరకు రింగు రోడ్డుపై భారీ గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు కనిపించక ప్రమాదాల బారిన పడే పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి రింగు రోడ్డుపై గోతులను వెంటనే పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

– కడప వైఎస్ఆర్ సర్కిల్



ఊటుకూరు రింగు రోడ్డు సర్కిల్ వద్ద ఏర్పడిన పెద్ద గుంత

వాతావరణ మార్పులతో జీవుల మనుగడకు ప్రమాదం



మాట్లాడుతున్న డాక్టర్ పి. సుబ్రహ్మణ్యం

వైవీయూ : వాతావరణ మార్పులతో కొన్ని రకాల జీవ జాతుల మనుగడకే ప్రమాదం పొంచి ఉందని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వి.సలీంబాషా అన్నారు. కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వాతావరణ మార్పు అంశంపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు జరిగితే విధ్వంసక తుఫాన్లు, ఉష్ణోగ్రత పెరగడం వంటి పరిణామం జరుగుతుందన్నారు. తేమ ఆవిరై తీవ్ర వర్షపాతం లేదా వరదలకు దారితీస్తుందన్నారు. వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వేసవి, తీవ్ర వేసవికాలం మాత్రమే కనిపిస్తున్నాయన్నారు. డాక్టర్ వి. రమేష్ వాతావరణ మార్పులతో కలిగే నష్టాలను, వాటి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నాగరత్నమ్మ, అనూరాధ, శాలెం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలని వినతి



డీసీఓ బ్రహ్మయ్యకు వినతిపత్రం సమర్పిస్తున్న పీఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : పాము కాటుకు గురైన విద్యార్థినులకు సకాలంలో వైద్యం అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన రైల్వేకొండాపురం బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ కృష్ణవేణిలను తక్షణమే సస్పెండ్ చేయాలని ప్రగతిశీల రెవెల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలల డీసీఓ వి.బ్రహ్మయ్యకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ 8వ తరగతి చదువుతున్న పల్లవి, వర్షిణి పాముకాటుకు గురయ్యారని తెలిసినా, ఎలుకలు కొరికాయనే నెపంతో నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. గతంలోనూ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నా సిబ్బంది తీరులో మార్పు రాలేదన్నారు. కలెక్టర్ స్పందించి ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నగర నాయకులు ఆకాశ్, సమీర్, గఫార్, పూజిత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి



విలేకర్లతో మాట్లాడుతున్న రాజేంద్ర ప్రసాద్

కడప ఎడ్యుకేషన్ : కొండాపురం గురుకుల పాఠశాలలో పాము కాటుకు గురైన విద్యార్థినులకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్(ఏ.ఐ.ఎస్.బి) జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. కడపలోని ఏఐఎస్‌బీ జిల్లా కార్యాలయంలో మంగళవారం అయన మాట్లాడుతూ పాము కాటు వేస్తే విద్యార్థులను ఆస్పత్రికి తరలించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచకుండా విష పురుగులు విద్యార్థుల రూముల్లో సంచరిస్తుంటే సిబ్బంది ఏమి చేస్తున్నారని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ డీసీఓను నియమించాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత పాముకాటుకు గురైన వారిని పరామర్శించకపోవడం దారుణమన్నారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న ముండ్ల నవనీశ్వర్‌రెడ్డి దంపతులు

ఖాజీపేట : కార్తిక మాసంలో పరమ శివుడిని పూజించేందుకు భక్తులు బారులు తీరుతున్నారు. ఖాజీపేట మండలం పుల్లూరు సమీపంలోని నాగనాథీశ్వరుడిని ఎంఆర్ఎఫ్ అధినేత ముండ్ల నవనీశ్వర్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయం దిగువన వారితోపాటు ముండ్ల శివప్రసాద్‌రెడ్డి కలిసి స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. నవనీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా కార్తిక మాసంలో తొలి సోమవారం రోజున అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఫర్నిచర్ విక్రయించిన నిందితుల అరెస్టు

కడప అర్బన్: ఫర్నిచర్ విభాగాలు విక్రయించిన నిందితులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.7 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. కడప నగరంలోని తాలూకా పోలీస స్టేషన్ పరిధిలో హరియాణాకు చెందిన ఓ కంటైనర్ లారీ డ్రైవర్‌తో కుమ్మక్కైన ముగ్గురు వ్యక్తులు డెలివరీ చేయాల్సిన ఫర్నిచర్ విడిభాగాలను ఇతరులకు విక్రయించారు. ఈ సంఘటన నాలుగు నెలల క్రిందట చోటుచేసుకుంది. ఈ సంఘటనపై హరియాణా నుంచి వచ్చిన యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారించి ఎఐ వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో హబీబ్, ముక్తియార్, అంజద్ బాషా ఉన్నారు. గుర్తించి నిందితుల నుంచి రూ.7 లక్షల నగదు సీజ్ చేశారు.

రిజర్వేషన్ల పెంపు.. క్రీడాకారులకు మేలు



బి.శివశంకర్‌రెడ్డి

కడప స్పోర్ట్స్ : ఉద్యోగాల్లో క్రీడల కోటా 2 నుంచి 3 శాతానికి పెంచడం క్రీడాకారులు ఎంతో మేలు చేస్తుందని ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ కడప జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి అన్నారు. విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ క్రీడా పాలసీలో భాగంగా రిజర్వేషన్ పెంపు, ఒలంపిక్ మెడలిస్టుల ప్రైజ్‌మనీ భారీగా పెంచడం ఆహ్వానించదగిన పరిణామమన్నారు. జాతీయ క్రీడలు, ఆఫ్రో ఏషియన్ గేమ్స్ రాష్ట్రంలో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయడంతోపాటు, మైదానాల నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

ట్రిపుల్‌ఈలో డాక్టరేట్



వీణా వాణి

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరానికి చెందిన బచ్చు వీణావాణికి కర్ణాటక యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. కడప నగరంలో నివాసముంటున్న వీణావాణి ఎంటెక్ పూర్తి చేసింది.

ఇంట్లో ఉంటూనే ఎలక్ట్రికల్ వాహనాల మార్గదర్శనం, బ్యాటరీ మార్పిడి వ్యూహాలకు సంబంధించిన సాంకేతికత మెరుగుపరిచేందుకు 'హ్యూరిస్టిక్ అప్టిమైజేషన్'పై పరిశోధన చేసింది. ప్రొఫెసర్ డాక్టర్ దారావత్ కిషన్, సహ పర్యవేక్షకులు డాక్టర్ ఎం.వశీం అహ్మద్‌ల ఆధ్వర్యంలో నిట్ కర్ణాటక, సుత్కల్‌లోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో సమర్పించిన పరిశోధనలకు ఆమెకు డాక్టరేట్ దక్కింది. ఈ సందర్భంగా కుటుంబీకులు ఆమెను అభినందించారు.

దుర్గమ్మ సన్నిధిలో దోష నివారణ పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరంలోని విజయదుర్గాదేవి ఆలయంలో భక్తులు దోష నివారణ కోసం మంగళవారం రాహుకాల పూజలు నిర్వహించారు. తొలుత అమ్మ వారి మూలమూర్తిని దర్శించుకుని, అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా పూజలు చేశారు. భక్తులు నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వ్యాసరచన పోటీలకు స్పందన

వైవీయూ : 'భారతదేశంలో విద్యా రంగంపై సాంకేతికత ప్రభావం' అంశంపై వైవీయూలో నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీలకు చక్కటి స్పందన లభించింది. యోగి వేమన విశ్వవిద్యాలయం మైనారిటీ సెల్, బయో టెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్ విభాగం కన్వీనర్ ప్రొఫెసర్ రియాజున్నీసా ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో యూనివర్సిటీలోని వివిధ విభాగాల విద్యార్థులు పాల్గొని తమ ఆలోచనలకు పదును పెట్టారు. సాంకేతికత లేకుండా విద్యా రంగాన్ని ఊహించ లేమని విద్యార్థులు పేర్కొన్నారు. న్యాయనిర్ణేతలుగా సైకాలజీ సహ ఆచార్యులు డా.కె.లలిత, జెనెటిక్స్ అండ్ జెనోమిక్స్ విభాగం సహ ఆచార్యులు మునికుమారి, ఉర్దూ విభాగం అధ్యాపకులు వ్యవహరించారు. విజేతలకు జాతీయ విద్యా దినోత్సవం రోజున బహుమతుల ప్రదానం చేస్తామని డాక్టర్ రియాజున్నీసా తెలిపారు.

ఖాళీ స్థలాలను పట్టించుకోకపోతే జరిమానా

నగర పాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి



ఓంశాంతి నగర్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని ప్రైవేటు స్థలాలను యజమానులు పట్టించుకోకపోతే జరిమానా విధించాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. పక్కీరుపల్లె, కొత్త బస్టాండు, ఐటీఐ సర్కిల్, మున్సిపల్ మైదానం ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఓంశాంతినగర్, నిరంజన్ నగర్‌లో చెత్త కుప్పలను తొలగించాలని ఆదేశించారు. శ్మశానవాటిక పరిశీలించి నడక మార్గంలో నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్త బస్టాండు వద్ద స్ట్రామ్‌వాటర్ డ్రైన్ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని కోరారు. ఐటీఐ సర్కిల్ సమీపంలోని డీసీఎంఎస్ గోడౌన్లను, మున్సిపల్ స్టేడియం వద్ద జరుగుతున్న ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం, అసిస్టెంట్ ఇంజినీర్లు ప్రతాప్ రెడ్డి, క్రిష్ణ, పవన్, శానిటేషన్ సిబ్బంది, ఆర్మీ రిక్రూట్మెంట్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్కీ డ్రా విజేతలకు బహుమతుల ప్రదానం



అమోఘా షోరూంలో బహుమతి ప్రదానం చేస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ సుంకర ఐశ్వర్య

కడప కార్పొరేషన్ : దసరా, దీపావళి సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రా విజేతలకు శ్రీ అమోఘా హోండా మేనేజింగ్ డైరెక్టర్ సుంకర ఐశ్వర్య బహుమతుల ప్రదానం చేశారు. స్థానిక చిన్నచౌక్‌లోని అమోఘా హోండా షోరూంలో ఆమె లక్కీ డ్రా తీసి ఇందులో మొదటి బహుమతి గెలుచుకున్న ఎం.సంజీవ్ కుమార్‌కు రిఫ్రిజిరేటర్, రెండో బహుమతి గెలుచుకున్న ఎస్.చాంద్‌బాషాకు వాషింగ్ మెషీన్, మూడో బహుమతి గెలుచుకున్న ఎ.రమణయ్యకు గీజర్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఐశ్వర్య మాట్లాడుతూ దసరా, దీపావళి సందర్భంగా తాము జిల్లాలోనే అత్యధిక అమ్మకాలు చేసి మొదటి స్థానంలో నిలిచామని తెలిపారు. ప్రతి ఏడాది లక్కీ డ్రా నిర్వహించి బహుమతుల ప్రదానం చేయడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో షోరూం జనరల్ మేనేజర్ సి.మల్లికార్జున, సేల్స్ జనరల్ మేనేజర్ ఫ్రాన్సిస్, ఫైనాన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి సవితకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజాంజనేయులు

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్(ఎస్‌టిఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. జిల్లా డీఆర్‌సీ సమావేశానికి హాజరైన జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి సవితను ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ 35 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. అలాగే సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలుచేయాలని, జెడ్పీ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. అరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఎస్‌టీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి నాగరాజు ఉన్నారు.

ద్వితీయ శ్రేణి నాయకులకు తీవ్ర నిరాశ



జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత ఆర్అండ్‌బీ అతిథి గృహానికి వస్తుండడంతో ఆమెను కలిసేందుకు బీసీ నేతలు, మైనార్టీ నాయకులు, నగరంలోని ద్వితీయశ్రేణి నాయకులు ప్రయత్నించారు. అయితే ఆమె స్పందించక వెళ్లిపోవడంతో వారికి నిరాశే ఎదురైంది. తోపులాటలో నెట్టివేయడంతో ఇబ్బందులు పడిన దృశ్యాలు సాక్షి కెమెరా బంధించింది.

– సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్

జిల్లాలో విజిలెన్స్ దాడులు



బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

కడప అర్బన్: కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ నెల 4న చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరు సర్కిల్‌లో విజిలెన్స్ అధికారులు దాడులు జరిపారు. లారీలో తరలించేందుకు సిద్ధంగా ఉంచిన అందులో 600 బస్తాలు 29910 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.25,60,905లు ఉంటుందని అధికారులు తెలిపారు. నంద్యాల జిల్లా బనగానపల్లి పట్టణంలో కొండపేటకు చెందిన ముత్తుకూరు శ్రీనివాసులు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి బియ్యం సేకరించి పోర్టుకు రవాణా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో బనగానపల్లికి చెందిన వి.దేశ్వేర రెడ్డి, జి.మద్దిలేటిలను పట్టుకుని చింతకొమ్మదిన్నె పోలీసులకు అప్పగించారు. పులివెందుల సీఎస్‌డీటీ అధికారులతో కలిసి సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరు గ్రామంలోని షెడ్డులో 105 బస్తాల 3469 కిలోల రేషన్ బియ్యం పట్టుకున్నారు. వీటి విలువ రూ. 1,57,839 ఉంటుందని అధికారులు తెలిపారు. తుమ్మల మిత్రమ నాయుడును పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

కడప అభివృద్ధికి ఐక్యంగా పనిచేద్దాం

కూటమి నేతలకు ఇన్‌ఛార్జి మంత్రి సవిత పిలుపు



జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నేత బీటెక్ రవి

కడప కార్పొరేషన్ : జిల్లా అభివృద్ధికి ఐక్యంగా ఉంటూ కృషి చేద్దామని కూటమి నేతలకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. మంత్రి హోదాలో కడప జిల్లాలో ఆమె తొలిసారిగా పర్యటించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ కడప ఇన్‌చార్జి మంత్రిగా పనిచేసే అవకాశం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కల్పించారన్నారు. ప్రతి సమావేశంలో రెండు నియోజక వర్గాలను సమీక్షిస్తామని తెలిపారు. సీనియర్ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరులో చేనేతల పేరుతో ఉన్న బోగస్ పింఛన్లను తొలగించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి మాట్లాడుతూ కస్తూర్బా విద్యాలయాల్లో ఇటీవల ఇష్టారాజ్యంగా నియామకాలు చేపట్టారని తెలిపారు. టీడీపీ నాయకుడు రితేశ్ మాట్లాడుతూ, 2014-19లో నీరు-చెట్టు, ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించాలని కోరారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి, తెరిచిన రౌటీ షీట్లను తొలగించాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు ఆదినారాయణ రెడ్డి, మాధవీరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, టీడీపీ నేతలు బూపేష్‌రెడ్డి, నర్సింహులు, రోశన్న, పుల్లయ్య, మదక చక్రధర్, జనసేన జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాసులు, బీజేపీ జిల్లా అధ్యక్షులు శశిభూషణ్ రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి మంత్రిగా బాధ్యతల స్వీకరణ

జిల్లా కలెక్టరేట్‌లో మంత్రి సవిత జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డీఆర్సీ సమావేశంలో పాల్గొన్నారు తొలిసారి మంత్రి హోదాలో జిల్లా పర్యటనకు విచ్చేసిన బీసీ సంక్షేమ శాఖా మంత్రికి టీడీపీ నాయకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, తదితరులు మంత్రికి పుష్ప గుచ్ఛాలు, మొక్కలు అందజేసి స్వాగతం పలికారు.

ఉక్కు పరిశ్రమ నెలకొల్పాలి

కడప సెవెన్‌రోడ్స్ : విభజన హామీలో భాగంగా జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో భారీ ఇంటిగ్రేటెడ్ ఉక్కు పరిశ్రమ నిర్మించాలని అఖిలపక్ష నాయకులు నారాయణ, సీఆర్‌వీ.ప్రసాద్, ఎన్.వెంకటశివ, సత్తార్, సీఎస్.ఆంజనేయులు, గుర్రప్ప కోరారు. డీఆర్సీ సమావేశానికి వచ్చిన ఇన్‌ఛార్జి మంత్రికి వినతిపత్రాన్ని సమర్పించారు. కరవులు, వలసలు నివారించి లక్ష కుటుంబాలకు ఉపాధి కల్పించే స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. కడప-బెంగుళూరు రైల్వే లైన్ పనులు ప్రారంభించి 20 ఏళ్లు అవుతున్నా కేవలం 20 కిలోమీటర్లే పూర్తి కావడం దురదృష్టకరమన్నారు. జిల్లాను కరవు ప్రాంతంగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.

బ్రౌన్ జయంతి నిర్వహణకై మంత్రికి వినతి

కడప కల్చరల్ : తెలుగు భాషోద్ధారకుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతి ప్రభుత్వం పక్షాన అధికారికంగా నిర్వహించాలని బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితకు వినతిపత్రాన్ని సమర్పించారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ అంశంపై ముఖ్యమంత్రి పేషీ అధికారులతో మాట్లాడతామని తెలిపారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి స్పందిస్తూ లేఖను సత్వర చర్యల కోసం ముఖ్యమంత్రికి పంపినట్లు తెలిపారు. అనంతరం జానమద్ది విజయభాస్కర్ ఇన్‌ఛార్జి మంత్రి సవితను శాలువతో సత్కరించారు. ఎర్రముక్కపల్లె నుంచి భాకరాపేట రైల్వే గేటు వరకుగల రోడ్డుకు బ్రౌన్ పేరు పెట్టి నూతన బోర్డు ఏర్పాటు చేయాలనికోరారు.

